

ఎఫ్ఎంసి సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు

ఇద్దరు అధికారులు సస్పెండ్

కొయ్యలగూడెం : ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో గతంలో కొయ్యలగూడెం ఆర్ఐగా పనిచేసిన మణిదివ్య, పరింపూడి విఆర్ఒ బట్టు వెంకటేశ్వరరావు పాత్ర ఉందని ప్రాథమిక విచారణలో వెలుగులోకి రావడంతో అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంది. ఇద్దరు అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. సర్టిఫికెట్ల జారీ విషయంలో అక్రమాల్లో ఆర్ఐ మణిదివ్యతో పాటు బట్టు వెంకటేశ్వరరావు ప్రమేయం ఉన్నట్లు తేలినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసుపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతుందని, విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం మణిదివ్య జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

రైతు బజార్లలో నాణ్యతేదీ..!

- నాణ్యత లేని లేని కూరగాయల విక్రయం
- ఏలూరు పత్తేబాద్, వన్‌టౌన్ రైతుబజార్లలో వినియోగదారులు గగ్గోలు
- ఉల్లి, టమోటా నాణ్యత మరింత దారుణం
- రైతు బజార్లలో కానరాని రైతులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతుబజార్లలో నాణ్యత లేని కూరగాయలు విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. నాసిరకం కూరగాయలతో రైతుబజార్లను నింపేస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. తక్కువ ధరకు ఇస్తున్నామనే సాకుతో దెబ్బతిన్న కూరగాయలు, ఉల్లిపాయలు, టమోటాలు పెద్దఎత్తున విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ అనేది పూర్తిగా లేకుండాపోయింది. ఏలూరు జిల్లాలో నాలుగు రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో ఏలూరు పత్తేబాద్‌లోని, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న రైతు బజార్లకు వినియోగదారులు తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆదివారమైతే పెద్దఎత్తున జనం రైతుబజార్లకు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తారు. ఉల్లిపాయలు కిలో రూ.28కు విక్రయిస్తున్నా కనీస నాణ్యత లేని పరిస్థితి ఉంది. టమాటా కిలో రూ.38 తీసుకుంటున్నా, మచ్చలున్న, దెబ్బతిన్న వాటిని విక్రయిస్తున్నారు. కిలో టమోటాలు మంచివి కావాలంటే 15 నిముషాలు ఏరితే తప్ప దొరకని పరిస్థితి ఉంది. క్యారెట్ సైతం తాజా సరుకు అమ్మకుండా నిల్వ సరుకు అమ్ముతున్నా పట్టించుకునేవారే లేకపోయారు. ఏలూరు నగరంలోని అత్యధిక జనాభా పత్తేబాద్ రైతుబజార్‌లోనూ కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. అయినప్పటికీ అక్కడ నాణ్యతకు సంబంధించి పరిశీలించే పరిస్థితి లేదు. వినియోగదారులు నాణ్యతపై వ్యాపారులను ప్రశ్నిస్తే ధర తక్కువగా ఉండేలా సరుకు కొనుగోలు చేయాలని అధికారులు చెబుతున్నారని అంటున్నారు. బహిరంగ మార్కెట్లకు, రైతుబజార్లకు కూరగాయల ధరల్లో పెద్దగా తేడా కన్పించడం లేదు. రైతుబజార్లలో మాత్రం ఎటువంటి నాణ్యత లేని కూరగాయలు విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ రైతుబజార్లలో పెద్దఎత్తున వ్యాపారం సాగుతోంది. జనం పెద్దఎత్తున వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నా. సరైన చర్యలు తీసుకోని పరిస్థితి ఉంది. మునగ, కొబ్బరికాయల ధరలు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నా పట్టించుకోని పరిస్థితి. ఒక్క మునగకాయ రూ.25కు విక్రయించడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. రైతుల నుంచి రూ.పదికి కొనుగోలు చేస్తున్న కొబ్బరికాయ రూ.20కుపైగా విక్రయిస్తున్నారు. అత్యంత ముఖ్యమైన జనం పెద్దఎత్తున కొనుగోలు చేసే ఉల్లి, టమోటా విషయంలోనూ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదు. చిక్కుడు అసలు



రైతు బజార్‌లో విక్రయిస్తున్న నాణ్యతలేని ఉల్లి, టమటాలు

ఏమాత్రం నాణ్యత ఉండటం లేదు. ధరలు అత్యధికంగా చెల్లిస్తున్నా సరుకు నాణ్యత లేకపోవడంపై వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేస్తే నాణ్యత లేకపోవడంతో రెండురోజులకే కుళ్లిపోతున్నాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం రైతుబజార్లు ఏర్పాటు చేసిన లక్ష్యానికి, క్షేత్రస్థాయి పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేకుండాపోయింది.

రైతుల నుంచి కొనుగోలే లేదు..!

ప్రభుత్వం రైతుబజార్లు ఏర్పాటు చేసినప్పుడు చెప్పిన మాటలకు.. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేదు. రైతుబజార్లలో కూరగాయలు విక్రయించేవారిలో రైతులు టార్చి పెట్టి వెతికినా కన్పించరు. రైతుల నుంచి నేరుగా కూరగాయలు కొనుగోలు చేయడం వంటి ప్రక్రియ ఇక్కడ లేదు. వన్‌టౌన్ పెద్దమార్కెట్‌లో దళారుల నుంచి కూరగాయలు కొనుగోలు చేసి రైతుబజార్లలో విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. నాణ్యత తగ్గిన సరుకును రైతుకు అతితక్కువ ధర చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అదే సరుకును ఎక్కువ ధరకు రైతుబజార్లలో వినియోగదారులకు అంటగడుతున్నారు. కూరగాయల నాణ్యత విషయంలో అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తెలియని పరిస్థితి ఉంది. రైతుబజార్లలో కూరగాయల నాణ్యతపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలుపై హర్షం

- 2.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతుల ఖాతాల్లో రూ. 620 కోట్లు సొమ్ము జమ
- గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలకు సొమ్ము
- 80 శాతం ఖరీఫ్ మాసూళ్లు పూర్తి
- రైతులకు 2,600 కొత్త టార్పలిన్లు అందజేత
- పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై రైతులు సంతోషంగా ఉన్నారని, ధాన్యం విక్రయించిన గంటల వ్యవధిలో సొమ్ము జమ కావడంపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగుతోంది. ఇప్పటి వరకూ ఎంతమేర ధాన్యం కొనుగోలు చేశారు. ఎప్పటిలోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే అవకాశం ఉంది. రైతులకు టార్పలిన్లు ఎంతమేర అందించారు. ధాన్యం కొనుగోలులో రైతుల నుంచి వచ్చిన సమస్యలు ఏమిటీ.. ఇప్పటి వరకూ ఎంతమేర ధాన్యం సొమ్ము జమైంది వంటి విషయాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో డిఎం వివరించారు.



ప్రశ్న: ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు టార్గెట్ ఎంత. ఇప్పటి వరకూ ఎంతమేర ధాన్యం కొనుగోలు జరిగింది?

డిఎం: ఖరీఫ్‌లో జిల్లాలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం. నవంబర్ 11న ధాన్యం కొనుగోలు ప్రారంభించాం. నెల రోజుల వ్యవధిలోనే ఇప్పటి వరకూ 2.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యింది.

ప్రశ్న: ధాన్యం సొమ్ము ఎంతమేర జమైంది. ధాన్యం సొమ్ము జమలో తాత్సారం ఏమైనా జరుగుతుందా?

డిఎం: ఇప్పటి వరకూ రైతుల ఖాతాల్లో రూ.620 కోట్లు ధాన్యం సొమ్ము జమైంది. ధాన్యం విక్రయించిన కొన్ని గంటల్లోనే ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో పడుతున్నాయి. దీంతో రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశ్న: తుపాను, వాతావరణ మార్పుల నేపథ్యంలో ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులకు టార్పలిన్లు ఏమైనా అందించారా?

డిఎం: 250 జిఎస్ఎం కలిగిన 2,600 కొత్త టార్పలిన్లతోపాటు, గతంలో వినియోగించిన 1,663 టార్పలిన్లు రైతులకు అందించారు. ప్రతి రైతుసేవా కేంద్రం వద్ద 20 వరకూ టార్పలిన్లు ఉండేలా చర్యలు తీసుకున్నాం. రైతులకు టార్పలిన్ల ఇబ్బంది ఎక్కడా రాలేదు.

ప్రశ్న: ధాన్యం కొనుగోళ్లు ఎప్పటిలోగా పూర్తయ్యే అవకాశం ఉంది?

డిఎం: ఇప్పటి వరకూ 80 శాతం వరకూ ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యాయి. ఇంకా ఏలూరు, పెదవేగి, పెదపాడు, నూజివీడు, జంగారెడ్డిగూడెం వంటి పలు ప్రాంతాల్లో మాత్రమే మాసూళ్లు పూర్తి కావాల్సి ఉంది. సంక్రాంతికి ముందుగానే 90 శాతం ధాన్యం కొనుగోలు పూర్తవుతోంది. కొన్నిచోట్ల రైతులు కుప్పలు వేస్తున్నారు. సంక్రాంతి తర్వాత రైతులు నూర్పిళ్లు చేపడతారు. ఫిబ్రవరి వరకూ ధాన్యం కొనుగోలు సాగనుంది.

ప్రశ్న: తేమశాతంపై రైతుల నుంచి ఏమైనా ఫిర్యాదులు వచ్చాయా?

డిఎం: తుపాను, వాతావరణ మార్పుల కారణంగా అదనపు రోజులు ధాన్యం ఆరబెట్టాల్సి వచ్చింది. లింగపాలెం మండలంలో తేమశాతానికి సంబంధించి రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో రంగాపురంలోని మిల్లుకు టార్గెట్ నిలిపివేశాం. మిల్లర్లు బాగా సహకారం అందించారు.

ప్రశ్న: కిరాయి, హమాలీల సొమ్ము ఏమైనా జమవుతుందా?

డిఎం: ఇంకా ప్రారంభం కాలేదు. ఈ వారం నుంచి జమయ్యే అవకాశం ఉంది.

ప్రశ్న: ధాన్యం కొనుగోలుపై రైతులకు ఏమైనా సూచనలు చేయదల్చుకున్నారా?

డిఎం: ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్యలున్నా జిల్లా యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుంది. ఎటువంటి ఇబ్బంది లేకుండా రైతుల ధాన్యం విక్రయించుకోవాలి. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సహకారంతో ధాన్యం కొనుగోలు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ముందుకు సాగుతోంది.

సాగు లేకపోతే చావే శరణ్యం

- మంత్రి పార్థసారధి వద్ద కొల్లేరు రైతుల కన్నీరు
- ఈ ప్రభుత్వంలోనే సమస్య వచ్చిందని ఆవేదన
- తోకలపల్లి సమాశానికి వేలాది మంది రైతులు
- అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌తో మాట్లాడతానని మంత్రి హామీ
- రెండు, మూడు రోజుల్లో నిర్ణయం చెబుతామని వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, నిడమర్రు

కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో రబీసాగుకు అవకాశం ఇవ్వకపోతే చావు తప్ప వేరే మార్గం లేదని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి వద్ద కొల్లేరు రైతులు కన్నీరుమున్నీరయ్యారు. నిడమర్రు మండలం పత్తేపురంలో ఆదివారం పేదల ఇళ్ల కాలనీని మంత్రి కొలుసు పార్ధసారధి ప్రారంభించారు. ఆయనతోపాటు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కొల్లేరు సాగుకు సంబంధించిన విషయంలో తోకలపల్లిలో కమ్యూనిటీ హాలు వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మండలంలోని అడవికొలను, గోపవరం, పెదనింద్రకొలను, ఆముదాలపల్లి, బైనేపల్లితోపాటు కొల్లేరు గ్రామాల నుంచి వేలాది మంది రైతులు తరలొచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సొసైటీ అధ్యక్షులు సైదు నాగరాజు, మాజీ సర్పంచి ఘంటసాల ఆదినారాయణ, గ్రామంలోని రైతులు వెంకటస్వామి తదితరులు మాట్లాడారు. వందల ఏళ్ల నుంచి కొల్లేరులో సంప్రదాయ వ్యవసాయ సాగు చేసుకుంటున్నామని రైతులు తెలిపారు. ఇప్పటి వరకూ తమను ఏ ప్రభుత్వమూ ఇబ్బంది పెట్టలేదని, ఈ ప్రభుత్వ హయాంలోనే తమకు ఇబ్బంది వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచి ఆదినారాయణ మాట్లాడుతూ ఈ భూములే తమకు జీవనాధారమని,



ఇబ్బందులను వివరిస్తున్న కొల్లేరు రైతు

సాగు చేయకపోతే చావుతప్ప వేరే మార్గం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. తరతరాల నుంచి ఇక్కడ వ్యవసాయం చేస్తున్నామని రైతులంతా మంత్రికి తెలిపారు. ఇప్పటికే సరైన ఉపాధి లేక కొల్లేరు గ్రామాల ప్రజలు వందల కిలోమీటర్లు వలస వెళ్లి ప్రమాదాలకు గురై ప్రాణాలు వదులుతున్నారన్నారు. ఇప్పుడు సాగు నిలిపివేస్తే ఉన్న ఉపాధి సైతం దెబ్బతిని రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు గ్రామాల ప్రజల బతుకుదెరువు అంతా ఈ భూములపైనే ఆధారపడి ఉందని రైతులంతా తెలిపారు. జనసేన నేత వెంకటలక్ష్మి, పత్తికోళ్లలంకకు చెందిన మహాలక్ష్మిరాజు కొల్లేరు రైతుల ఇబ్బందులను మంత్రికి వివరించారు. రైతులతో మాట్లాడిన అనంతరం మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌తో కొల్లేరును ఆనుకుని ఉన్న వ్యవసాయ సాగుపై మాట్లాడతామని, రెండు, మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని చెప్పారు. రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని మంత్రి అటవీశాఖ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. వ్యవసాయానికి సమయం ఆసన్నమైందని, తాము భూముల్లోకి వెళ్తామని రైతులు చెప్పారు. మంత్రి నుంచి తమకు స్పష్టమైన హామీ వస్తుందని ఎదురు చూశామని, అయితే పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వకపోవడం రైతుల్లో నిరాశ నింపింది. ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ కొల్లేరు రైతుల గురించి నిరంతరం ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతున్నామన్నారు. రైతులకు కచ్చితంగా న్యాయం జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పోలవరం జిల్లాలో 'పోలవరం'ను కలపాలి

చెంచుగూడెం, ఇనుమూరు గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేసే పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ ఆదివారం చెంచుగూడెం, ఇనుమూరు గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు తామా ముత్యాలమ్మ మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా చేయటం హర్షించదగ్గ విషయమన్నారు. అయితే పోలవరం నియోజకవర్గం దానిలో లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలు కలిపి జిల్లా చేస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న చెంచుగూడెం, ఇనుమూరు గ్రామస్తులు

ఒత్తిడిని జయించేందుకు బాలోత్సవాలు దోహదం


ఘనంగా బహుమతుల ప్రదానోత్సవం



బహుమతులు అందిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి మానసిక స్థయిర్యాన్ని పెంపొందించుకునే అవకాశం బాలోత్సవం వంటి వల్లే సాధ్యమని హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం సిఆర్‌రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో హేలాపురి ఆరో బాలోత్సవం విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు మారుమూడి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రెండు రోజులపాటు నిర్వహించిన వివిధ పోటీల్లో వందలాది మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జిల్లా నలుమూలల నుండి గెలుపొందిన విద్యార్థులకు బాలోత్సవం నిర్వాహకులు మెడల్స్, సర్టిఫికెట్లు, మెమొంటోస్ ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నరసింహారావు మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవం విద్యార్థుల్లో దాగిఉన్న శాస్త్ర సాంకేతిక అంశాలతోపాటు జానపద కళలు, సాంస్కృతిక కళలు, అధునాతన టెక్నాలజీకి సంబంధించిన ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడిందన్నారు. మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడం నేటి విద్యార్థులకు కత్తి మీద సాముగా మారిందన్నారు. విద్య అంటే పాఠ్యపుస్తకాలు మాత్రమే కాదని, సమాజాన్ని అధ్యయనం చేయడమేనని చెప్పారు. విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించే క్రీడాంశాలు, సాంకేతిక అంశాల పట్ల ప్రభుత్వం మరింత శ్రద్ధతో వ్యవహరించాలని సూచించారు. బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థుల ప్రతిభ ఆశ్చర్యానికి గురి చేస్తుందని చెప్పారు. రానున్న కాలంలో బాలోత్సవాన్ని మరింత విస్తృత పరుస్తామని వివరించారు. బాలోత్సవ నిర్వహణకు సహకరించిన విద్యార్థులకు, యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మేతర అజయ్‌బాబు, ముస్తఫా ఆలీ, ఎస్ఎన్.కట్టా, కస్తూరి రావు, దివ్వి హేమసుందర్ నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవంలో ప్రముఖులు, బాలికలు

10,798 కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌లో 10,798 కేసులు పరిష్కారమయ్యాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు జిల్లా వ్యాప్తంగా 34 బెంచీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 10,351 క్రిమినల్ కేసులు, 153 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 294 సివిల్ కేసులను రాజీ చేశారని, వీటితోపాటు 238 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వీటిలో ఏలూరులో 1988, భీమవరంలో 974, చింతలపూడిలో 1248, జంగారెడ్డిగూడెంలో 971, కొవ్వూరులో 1092, నర్సాపురంలో 434, పాలకొల్లులో 458, తాడేపల్లిగూడెంలో 1433, తణుకులో 1082, నిడదవోలులో 919, భీమడోలులో 153 పెండింగ్ కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

ఉదయ్‌కార్తీక్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - పెదవేగి

జిల్లాలో ఏలూరులో జరుగుతున్న ఆరో హేలాపురి బాలోత్సవాల కార్యక్రమంలో భాగంగా సంగీత వాయిద్యా పరికరాల విభాగంలో పెదవేగి మండలం రామసింగవరం ఎంపిపి పాఠశాలలో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థిని ఉదయ్ కార్తీక్ ప్రథమ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు. విద్యార్థి ఉదయ్‌కార్తీక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుంటూరు శ్రీనివాసరావు, సర్పచి అడపా శ్రీను, ఎంపిటిసి సభ్యులు మాధవరావు, గ్రామ పెద్దలు రాఘవ, పిసి ఛైర్మన్, పాఠశాల సిబ్బంది పరసా నాగార్జున, లక్ష్మీనారాయణ, సాయి శ్రీనివాస్, శ్రీనివాస్, లాజరు, తదితరులు తదితరులు అభినందించారు.



ఉదయ్‌కార్తీక్‌ను అభినందిస్తున్న అభినందిస్తున్న పలువురు

నేరస్తులను పసిగట్టేందుకు ప్రత్యేక చర్యలు

స్కోర్ 10 యాప్‌తో ముందుకు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

నగరానికి, జిల్లాలోని ప్రాంతాలకు వచ్చే కొత్త వారి వివరాలను తెలుసుకునేందుకు సౌలభ్యం కల్పించే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జిల్లా పోలీసులు ఒక అడుగు ముందుకు వేశారు. ఇందులో భాగంగానే స్కోర్ 10 అనే పేరుతో నిర్వహిస్తున్న ఒక యాప్‌ను ఆ యాప్ నిర్వాహకుల సహాయంతో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్‌ను వినియోగించి కొత్త వారి ఆధార్ కార్డు నెంబర్‌ను వాట్సాప్ చేస్తే వెంటనే వారిపై ఉన్న నేర వివరాలను ఈ స్కోర్ యాప్ నిర్వాహకులు మనకు తెలియజేస్తారు. దీనికి వారు ఫీజులు కూడా వసూలు చేస్తారు. సోషల్ సర్వీస్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ స్కోర్ 10 యాప్ నిర్వాహకులు నారాయణ స్వరూప్ మనం కొత్త వారి వివరాలు తెలుసుకునేందుకు వీలు కల్పించే విధంగా ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కొత్త వ్యక్తులు అపరిచిత వ్యక్తుల వివరాలను తెలుసుకునేందుకు వీలుగా స్కోర్ 10 యాప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ నేరాలు జరగకముందే నేరస్తులను పసిగట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఇతర రాష్ట్రాల నుంచి హోటల్లో పని చేయడానికి వస్తుంటారని, వారి ఆధార్ కార్డుల ద్వారా వారికి ఏమైనా నేర చరిత్ర ఉందో లేదో తెలుసుకునేందుకు ఈ స్కోర్ యాప్‌ను వినియోగించుకోవచ్చున్నారు. ఈ స్కోర్ 10 యాప్ యాజమాన్యం ఏలూరు నగరంలో ఉన్న ఆటో డ్రైవర్లకు ఉచిత బీమా సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు రూ.లక్ష ప్రమాద బీమాను కల్పించే విధంగా బీమా విధానాన్ని అమలు చేసేందుకు వారు సిద్ధమయ్యారని, ఆటో డ్రైవర్లకు ఈ బీమా సౌకర్యం వెంటనే అందుబాటులోకి వస్తుందని ఎస్‌పి తెలిపారు. డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వరరావు, ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు, త్రీ టౌన్ సిఐ పాల్గొన్నారు.

గణనీయంగా పెరిగిన మొక్కజొన్న సాగు

ఎరువుల కొరత లేకుండా వ్యవసాయాధికారుల చర్యలు



సాగువుతున్న మొక్కజొన్న

ప్రజాశక్తి - ముసునూరు

మెట్ట ప్రాంతమైన ముసునూరు మండల పరిధిలో రబీ కాలంలో సీడ్ మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగింది. ఖరీఫ్ సీజన్‌లో వరి పంట దిగుబడులు ఆశాజనకంగా పెరగడంతో కోతలు పూర్తయి ధాన్యం ఎగుమతులు సాగుతున్నాయి. మరోపక్క మొక్కజొన్న పంట సాగు సన్నాహాల్లో రైతులు నిమగ్నమయ్యారు.

ఖరీఫ్ చివరి సమయంలో కురిసిన భారీ వర్షాలతో చెరువులో నీరు పుష్కలంగా ఉండి భూగర్భ జలాలు పెరిగాయి. మరో వైపు సాగర్ జలాలు కూడా వస్తుండటంతో రైతులు మొక్కజొన్న పంటపై ఆశలు పెంచుకున్నారు.

చీడ, పీడ పురుగులపై ప్రత్యేక దృష్టి

మొక్కజొన్నలో కత్తెర, కాండం తొలుచు పురుగు సూక్ష్మ పోషకాలపై రైతులను నిరంతరం అప్రమత్తం చేస్తూ ప్రతి మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తూ అధికారులు ప్రత్యేక సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రబీ పంట కాలం సమయంలో అత్యధికంగా మొక్కజొన్న సాగు చేసే మండలాల్లో నూజివీడు నియోజకవర్గం పరిధిలోని ముసునూరు మండలం ఒకటి. సుమారు 9,980 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి తెలిపారు. మినుము 2500 ఎకరాల్లో, వరి 2800 ఎకరాల్లో, పొగాకు 3100 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రబీలో సాగు విస్తరణ పెరిగే అవకాశం ఉండటంతో, ఎరువుల కొరత లేకుండా దిగుబడులను పెంచేలా రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

దుష్ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలి

సూర్యకిరణ్


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని మైసన్నగూడెం గ్రామానికి చెందిన తన తల్లి భూలక్ష్మి అధికారులపై, తమపై చేస్తున్న ప్రచారం దుష్ప్రచారమని ఆమె కుమారుడు సూర్యకిరణ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం భూ పంపిణీలో భాగంగా అసైన్‌మెంట్ కమిటీ ద్వారా తమకు భూమి ఇచ్చారని తెలిపారు. రూ.లక్షలు ఇచ్చి ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్ చేశారని దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారిపై బెదిరింపులు, అనుచిత వ్యాఖ్యలు చేసిన భూలక్ష్మిపై, ప్రోత్సహించిన యూట్యూబ్ ఛానల్ పై సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మైసన్నగూడెంలో ఉన్న భూస్వాములు కాంగ్రెస్ హయాంలో సర్వే నెంబర్ 49లో సుమారు తొమ్మిది ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ఆమోదంతో తమకు భూమి ఇవ్వడంతో కొంతమంది భూస్వాములు ఓర్చుకోలేక కుటుంబంలో కలహాలు రేపి మా అమ్మకు లేనిపోని మాటలు చెప్పి మా భూములను రద్దు చేయాలంటూ తెలిపారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి అసత్య ప్రచారాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎర్రంపేట గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెలా ఐదో తేదీ లోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చెప్పులు, టవళ్లు, కొబ్బరి నూనె, గ్లౌజులు వంటి మౌలిక సౌకర్యాలు అందించాలని కోరారు. సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి నాలుగో తేదీన విశాఖపట్నంలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీసం ప్రతి కార్మికుడికి రూ.15 వేల చొప్పున వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, బి.సుబ్బారావు, వై.వెంకటేశ్వరరావు, వై.దుర్గారావు, జి.గంగరాజు, ఎం.వెంకట్రావు, కె.వెంకటేష్, ప్రమీల, భార్గవి తదితరులు పాల్గొన్నారు.




చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ఆపదలో ఆపన్న హస్తంలా సిఎం సహాయ నిధి

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - పెదవేగి

నిరు పేదలకు ఆపదలో ఆపన్న హస్తంలా సిఎం సహాయ నిధి నిలుస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో ఇటీవల పాముకాటుకు గురై అనారోగ్యం బారిన పడి చికిత్స పొందిన పామర్తి రూస్సీ రాణి అనే మహిళకు ఎంఎల్ఎ చింతమనేని చొరవతో సిఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి అందించారు. బాధితురాలి యోగక్షేమాలు, కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఉన్న కాలనీ రోడ్లను పరిశీలించి శుభ్రత పాటించకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల కోసం నిర్మించిన రహదారులను శుభ్రంగా ఉంచటం, సక్రమంగా నిర్వహణ చేసుకోవటం సంబంధిత అధికారులతో పాటు స్థానిక కూటమి నాయకులు, ప్రజల సామాజిక బాధ్యత అని చెప్పారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ శుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని, తద్వారా ప్రజలు అనారోగ్య బారిన పడకుండా జీవించేందుకు దోహదపడుతుందని ఎంఎల్ఎ సూచించారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంఎల్ఎ బాలరాజు

50 మందికి దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తల్లి తెల్లం మల్లమ్మ మొదటి వర్ధంతి కార్యక్రమం మండలంలోని దుద్దుకూరు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది వృద్ధులకు మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతుల చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

రూ.4.10 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో చోటు చేసుకున్న దొంగతనం కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.4.10 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జంగారెడ్డిగూడెం సిఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జంగారెడ్డిగూడెం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, ఎఎస్‌పి సుస్మితా రామనాథన్ వెల్లడించారు. ఎఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం.... తిరుమలాపురం గ్రామానికి చెందిన కానుపర్తి లక్ష్మీనరసింహ ఆనంద్‌కుమార్ ఇంట్లో ఈ నెల 12వ తేదీ రాత్రి గుర్తు తెలిని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం చేపట్టిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన ముత్యాల గణేష్, శీలం ఆంజనేయులు, కటూరి సుబ్రహ్మణ్యంలను అదుపులోకి తీసుకున్నారు. వారికి విచారించగా కేసులో నిందితులు వారేనని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బంగారు, వెండి వస్తువులు, ఎల్‌ఇడి టివి, మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు, మోటార్ సైకిల్ సహా సుమారు రూ.4.10 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్‌పి తెలిపారు. ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిశోర్ పర్యవేక్షణలో, జంగారెడ్డిగూడెం సిఐ ఎంవి.సుభాష్ నేతృత్వంలో ఎస్ఐ వీరప్రసాద్, సిబ్బంది సమన్వయంతో కేసు ఛేదించినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - భీమడోలు

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కురెళ్లగూడెం గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు భీమడోలు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసును భీమడోలు ఎస్ఐ మదీనా భాష దర్యాప్తు చేస్తున్నారు.

ఆయన జీవన పోరాటం స్ఫూర్తిదాయకం

ఆదర్శంగా నిలుస్తున్న వృద్ధుడు వెంకటేశ్వరరావు

ఒక కాలుతోనే సైకిల్ తొక్కుతూ బట్టల వ్యాపారం



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


జంగారెడ్డిగూడెం పరిసరాల్లో సైకిల్‌పై బట్టల కట్టుకుని నిశ్శబ్దంగా ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి. ఆయనే జంగారెడ్డిగూడేనికి చెందిన పి.వెంకటేశ్వరరావు. ఆయనకు 24 ఏళ్ల వయసులో జరిగిన ప్రమాదంలో ఒక కాలు పూర్తిగా కోల్పోయినా ఆయన జీవితం మాత్రం ఆగలేదు. బాధని పక్కనపెట్టి, పరిస్థితులను ఎదుర్కొని, పట్టుదలని ఆయుధంగా మార్చుకుని గత 40 ఏళ్లుగా ఒంటికాలుతోనే సైకిల్ తొక్కుతూ బట్టల వ్యాపారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ రోజుల్లో అన్ని అవయవాలు సరిగా ఉండి కూడా ఏ పని చేయకుండా కొంతమంది ఖాళీగా తిరుగుతుంటారు. అలాంటివారికి ఆయన ఆదర్శంగా నిలవాలని ఆయనను చూసిన ప్రజలు అంటున్నారు. రద్దీ రోడ్లపై, వేడి ఎండల్లో, వర్షంలో కూడా ఆయన అక్కడక్కడా కనిపిస్తారని ప్రజలు చెబుతున్నారు. శరీరానికి ఒక అవయవం లేకపోయినా మనసుకు మాత్రం అసలే తగ్గేదేలే అన్నట్లు వెంకటేశ్వరరావు ముందుకు సాగుతున్నారు. ఎంతో మంది అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా అవకాశాలు వృథా చేసుకుని బద్ధకంగా తిరుగుతుంటే వెంకటేశ్వరరావు ఒక్క కాలుతో చేసిన పోరాటం నిజంగా స్ఫూర్తిదాయకం. జీవితం మనకు ఏమిచ్చిందన్నది కాదు.. మనం ఆ జీవితాన్ని ఎలా నడిపించామన్నదే గొప్పదని, అందుకు ఆయన ఉదాహరణగా నిలుస్తున్నారు. ఇలాంటి పట్టుదల, ధైర్యం, కష్టానికి నమస్కారం. ఆయన ప్రయాణం మరెందరికో ధైర్యం నింపాలని మనసారా కోరుకుంటున్నామని జంగారెడ్డిగూడెం ప్రజలు అంటున్నారు. అలాగే ప్రభుత్వం ఇలాంటి వారికి ఏదోక రూపంలో ఆధారం కల్పించాలని, వయస్సు పెరగడంతో ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

2014-19 గృహ నిర్మాణ బిల్లులు అందిస్తాం

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నిడమర్రు

2014-19 కాలంలో గృహ నిర్మాణాలు ప్రారంభించి సగంలో నిలిచిపోయిన ప్రతి లబ్ధిదారుడికి బిల్లులు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలిసి ఆయన నిడమర్రు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ 2014-19 కట్టుకున్న ఇళ్లకు కాకుండా వైసిపిలో జరిగిన నిర్మాణాలకే బిల్లులు ఇచ్చారని, దీనిపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ 2014-19లో అప్పటి టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన 2,73,000 ఇళ్లకు సంబంధించి రూ.923 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆ తరువాత అధికారంలోకొచ్చిన జగన్ దుర్మార్గపు పరిపాలన వ్యవస్థ కారణంగా 4,70,000 పునాదుల్లో ఉన్న ఇళ్లను రద్దు చేసిందని దుయ్యబట్టారు. జగన్మోహన్‌రెడ్డి అనైతిక ఆర్థిక నిర్వహణ కారణంగా ప్రభుత్వం రూ.పది లక్షల కోట్లు అప్పుల్లో కూరకుపోయిందని, ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతోందని, బిల్లులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పత్తేపురం కాలనీలో తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను నేరుగా రా వాటర్‌ను సరఫరా చేసేందుకు అనుమతులు ఇవ్వాలని ఎంఎల్ఎ ధర్మరాజు మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ నిధులతో ఒహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు ఆదేశాలిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న మంత్రి

సొసైటీ సేవలు అభినందనీయం

మహాజన సభలో ప్రముఖులు

ప్రజాశక్తి - -ఏలూరు అర్బన్

స్థానిక ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ది ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ప్రొవెన్షియల్ వర్క్ ఛార్జిడ్ మినిస్టీరియల్ అండ్ లాస్ట్ గ్రేడ్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పశ్చిమగోదావరి జిల్లా 42వ మహాజన సభ ఆదివారం సంఘం కార్యదర్శి జవంగుల బాపయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏలూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ చిలకపాటి దేవ ప్రకాష్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో ఈ సొసైటీ ఇరిగేషన్ ఉద్యోగుల కోసం గత 40 ఏళ్లుగా అనేక సేవలను అందిస్తోందని, లోన్స్ తీసుకున్న ఉద్యోగులు సకాలంలో బకాయిలు తీర్చి సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు అవసరమైన సందర్భంగా లోన్స్ ఇవ్వటమే కాకుండా ఇరిగేషన్ కో ఆపరేటివ్ సొసైటీ ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగుల పిల్లలకు ప్రోత్సాహకాలు ఇస్తూ ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సొసైటీలో ఉన్న నిధులు వెచ్చించి ఆపదలో ఉన్నవారికి ఆదరణ కల్పించడాన్ని కొనియాడారు. ఇరిగేషన్ ఉద్యోగుల సొసైటీ మిగతా ఉద్యోగుల సొసైటీలకు ఆదర్శంగా నిలిచిందని, గతంలో కూడా ఈ సొసైటీ జిల్లాలో అగ్రగామిగా నిలచిందని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా పలువురు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. నీరు-ప్రగతి సూపరింటెండింగ్ ఇంజినీర్ బి.వెంకటస్వామి, డిప్యూటీ ఎస్ఇ పుట్టా ధనుంజేయులు, ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, జెఎసి నాయకులు ఆర్ఎస్ హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖులు

రోడ్డుకు గ్రామస్తుల తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని టి.నరసాపురం పంచాయతీలోని గండిగూడేనికి ఆర్‌టిసి బస్సు సర్వీసు పునరుద్ధరించాలని ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఏలూరు ఆర్‌టిసి డిపో అధికారులు రూట్ సర్వే నిర్వహించి రోడ్డు గుంతలు పూడ్చాలని, గృహ అవసరాల విద్యుత్ వైర్లు పైకి లేపాలని, కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు తొలగించాలని పలు సూచనలు చేశారు. దీంతో గ్రామస్తులు సొంత ఖర్చులతో చింతల వద్ద నుంచి గండిగూడెం గ్రామం వరకు గుంతలు పూడ్చారు. ఈ కార్యక్రమంలో నాసర్ పాషా, కొరివి శేషారావు, పింగుల మధు, కొరివి వెంకటేశ్వరరావు, బడుగు రాఘవులు, పిన్నుబోయిన వెంకటేశ్వరరావు, నాగనబోయిన వీరనాగేశ్వరరావు, పి.జయంత్ కుమారస్వామి, సాయిల రామకృష్ణ, సత్యనారాయణ, చంద్రం, పాల్గొన్నారు.



మరమ్మతులు చేయిస్తున్న గ్రామస్తులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఇటీవల పలువురు ఎంపిటిసి సభ్యులు ఎంపిపి కోర్స పోసమ్మపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దానిపై సమావేశం జరగకపోవడంతో అసహనానికి లోనై శుక్రవారం జరిగిన సమావేశానికి హాజరు కాలేదని తెలిపారు. అయితే మళ్లీ వాయిదా వేయడంతో సోమవారం జరిగే సమావేశానికి మెజార్టీ ఎంపిటిసి సభ్యులు హాజరు అవుతారో లేదో చూడాలి.

మేలు జాతి పశుగణాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

పశుసంవర్ధక శాఖ అధికారులకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సూచన

ప్రజాశక్తి - పెదవేగి

గ్రామాల్లో మేలు జాతి పశుగణాభివృద్ధికి పశుసంవర్ధక శాఖ అధికారులు కృషి చేయాలని, తద్వారా పశువుల పెంపకం దారులకు, పాడి రైతులకు ఎంతో మేలు కలుగుతుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు ప్రజలు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను పెదవేగి మండలం దుగ్గిరాలలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రికలను, పుష్పగుచ్ఛాలను అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సంచార విధానంలో పశువులలో కృత్రిమ గర్భధారణకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉపయోగించే లిక్విడ్ నైట్రోజన్ కంటైనర్లను ఎంఎల్ఎ పరిశీలించారు. గ్రామాల్లో పాడి రైతుల అభివృద్ధికి, పశువుల పెంపకం దారుల సంక్షేమానికి అవసరమైన చర్యలన్నీ కూడా చేపట్టాలని పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సూచించారు.



పరికరాలు అందిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని

తెలుగు జాతి కీర్తి శిఖరం ఆరుద్ర


జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యాన శత జయంతి కార్యక్రమం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు సాహిత్యమండలిలో ఆదివారం తెలుగు జాతి కీర్తి శిఖరం ఆరుద్ర శత జయంతి కార్యక్రమాన్ని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి అనేవి నాగరిక సమాజం ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని, జాతిని ప్రగతిశీలక బాటలో గొప్పగా ప్రభావం చేసిన కవి ఆరుద్ర అని అన్నారు. ఆయన జనరంజక సినీగీతాలు, త్వమేవాహం, సినీవాలి తదితర కావ్యాలు, సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర తదితర పరిశోధన గ్రంథాలు తెలుగు జాతి ఉన్నంత వరకు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఆరుద్ర స్మారక సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ జివి.పూర్ణచందు మాట్లాడుతూ ఆరుద్ర శత జయంతి వేడుకలను ప్రభుత్వమే అధికారికంగా చేయాలని, అలాంటి మహనీయులను ప్రభుత్వాలు విస్మరించడం తెలుగుజాతికే ద్రోహమని చెప్పారు. సంఘ ప్రధాన కార్యదర్శి నాగాస్త్ర మాట్లాడుతూ పాలన భాష, బోధనా భాష, న్యాయ స్థానాల భాష ప్రజల మాతృభాష కానప్పుడు తెలుగు జాతి ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని, ఆరుద్రకు నిజమైన వారసుడు ఈ మూడు అంశాలపై ప్రాంతీయ, జాతీయ స్థాయిలో పోరాడుతున్న పూర్ణ చంద్ అని అన్నారు. సభా నిర్వాహకుడు లేళ్ల వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఇలాంటి అరుదైన కార్యక్రమాలు చేపట్టినప్పుడు స్థానికంగా ఉన్న మేధావులు సామాజిక బాధ్యతగా భావించి తోడ్పాటును అందించాలని, ముందు తరాలకు ఆది స్ఫూర్తిని అందిస్తుందని చెప్పారు. అనంతరం ఆరుద్ర స్మారక సాహిత్య అవార్డును తెలుగు భాషోద్యమ నాయకులు, ఇప్పటికీ ఆరు పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభను దిగ్విజయంగా నిర్వహించిన, శతాధిక గ్రంథకర్త సాహిత్య సంపూర్ణ జీవి జివి.పూర్ణచందుకు ఇచ్చారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖులు



ఆర్థిక సాయం అందిస్తున్న రామకృష్ణ

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి


మండలంలోని అల్లూరు గ్రామంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వద్ద చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో తోట నాగరాజుకు చెందిన రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంలో నాగరాజు కుటుంబ సభ్యులు సర్వం కోల్పోయి కట్టు వస్త్రాలతో బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, గ్రామ సర్పంచి శీలం రామకృష్ణ అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శీలం వీరాంజనేయులు, జంగం లాజర్, పంతగాని రాజు, గంగుల ఏడుకొండలు, కరేటు సాయి, గొల్లపల్లి శ్రీనివాసరావు, పలిపే దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు లక్ష్మయ్యచార్యులు, ఈశ్వరాచార్యులు

సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విశ్వకర్మ సామాజిక తరగతి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ భర్త, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు లక్ష్మయ్య చార్యులు, విశ్వకర్మ తెలంగాణ ముద్దుబిడ్డ సాయి ఈశ్వర చారిలు చిరస్మరణీయులని పలువురు అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో దురిసేటి మాధవాచార్యులు నివాసంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ భర్త, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు లక్ష్మయ్య చార్యులు, విశ్వకర్మ తెలంగాణ ముద్దుబిడ్డ సాయి ఈశ్వర చారిల సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. లక్ష్మయ్య చార్యులు, ఈశ్వర చారిల మృతికి సంతాప సూచకంగా సంఘ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అరిగే పిచ్చయా చారి, బెజ్జంకి గంగాధర్ మాట్లాడుతూ లక్ష్మయ్య చార్యులు ఎందరో పేదలకు వైద్య సేవలను సకాలంలో అందించడం ద్వారా అందరివాడిగా ఎదిగిన తీరును వివరించారు. పొరుగు తెలుగు రాష్ట్రమైన తెలంగాణ విశ్వకర్మ ముద్దుబిడ్డ సాయి ఈశ్వర చారి ఆకస్మిక మృతి విశ్వకర్మ సమాజానికి తీరని లోటుగా చెప్పారు. అమరులైన వారి ఆశయాలను విశ్వకర్మ సంఘీయులుగా ప్రతిఒక్కరూ ఆచరించి చూపాల్సిన బాధ్యత ఉందన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, విరాట్ విశ్వకర్మ, మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆశీస్సులతో వారి కుటుంబాలు దు:ఖసాగరం నుంచి బయటకు రావాలని ఆకాంక్షించారు. ఆ కుటుంబాలకు విశ్వకర్మ సంఘీయులుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖులు

నేడు ఏలూరుకు హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన ఏలూరు తూర్పు వీధి, పడమర వీధి శ్రీ గంగానమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ పోతురాజుబాబు జాతర మహోత్సవాలకు ఈ నెల 15వ తేదీ సోమవారం హోం మంత్రి వంగలపూడి అనిత విచ్చేస్తున్నట్లు ఆలయ కమిటీ వారు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి చేసిన రంగా

విగ్రహావిష్కరణలో ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెదవేగి

పేద, బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతి కోసం కృషి చేసిన కీర్తిశేషులు వంగవీటి మోహన్‌రంగా పేరు రాష్ట్రంలో, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం ములక్కాయపాడు గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆదివారం ఉదయం స్థానిక కూటమి నాయకులు, గ్రామస్తులతో కలిసి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి భారీ గజమాలవేసి జోహార్ వంగవీటి మోహన్ రంగా అంటూ నినాదాలు పలుకుతూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతి కోసం చివరి వరకు పోరాటం చేసి బడుగు బలహీన తరగతుల ఆశాజ్యోతిగా ఈనాటికి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వంగవీటి మోహన్‌రంగా పేరు ఈ రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, వారి ఆశయాలు సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి విచ్చేసిన దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌కు స్థానిక కూటమి నాయకులు, గ్రామస్తులు, మహిళలు పూలమాలలు వేసి మంగళహారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ పెదవేగి మండలాధ్యక్షులు ఈడుపుగంటి అనిల్, పెదవేగి సొసైటీ అధ్యక్షులు తాతా సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు కొట్టు నరేష్, ముప్పాల నాగేశ్వరరావు, పెన్మెత్స జయప్రకాష్ నారాయణ, సుగసాని గంగాధరరావు (గంగయ్య), పలువురు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు డిఎస్‌పి ప్రసాద్ ఆదేశాల మేరకు టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో వారి సిబ్బందితో నూజివీడు టౌన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ (ఫుట్ పెట్రోలింగ్) విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, మైనర్ల వాహన డ్రైవింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనదారులు నిర్బంధంగా రూల్స్ పాటించాలని, అతివేగం నివారించాలని, వేగం వద్దు - ప్రాణం ముద్దు అన్న నినాదాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. విజిబుల్ పోలీసింగ్ సందర్భంగా మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఘటనలు గమనించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన సమస్యలను వివరించి వారిని చైతన్యపరిచారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో భద్రతా భావం పెంపొందించాలని, నేరాల నివారణకు ఇది దోహదపడుతుందని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ గౌరవనీయ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు : తాడేపల్లిగూడెం

H.M.O.P.200/2025

మధ్య:

శ్రీ లక్కాపో ఆనందరావు, తండ్రి సుబ్బారావు, పురుషుడు, వయస్సు 43 సంవత్సరాలు, ప్రైవేట్ ఉపాధ్యాయుడు, ఇంటి నెం.1-5, అరుంధతిపేట, కాస్త పెంటపాడు గ్రామం, పెంటపాడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా - 534166.

...పిటిషనర్

మరియు

శ్రీమతి లక్కాపో మేరీ రత్నం, భర్త లక్కాపో ఆనందరావు, తండ్రి లేటు, జువ్వా చిన్నారావు, స్త్రీ, వయస్సు 38 సంవత్సరాలు, గృహిణి, నివాసం ఇంటి నెం.14-10-37/1, 24వ వార్డు, అంబేద్కర్ కాలనీ, న్యూ కాలనీ, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా - 534166.

...ప్రతివాది

పిటిషనరు తరపు వేసిన పత్రికా ప్రకటన

U/ఆర్డరు 5 రూలు 20 సిపిసి ప్రకారం

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పై నెంబరు H.M.O.P లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు నుండి H.M.O.P సమన్లు పంపినా మీరు అందుకోనందున సదరు నోటీసు సబ్ సిస్ ట్యూట్ సర్వీసు నిమిత్తం ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కావున మీరు ది.17-12-2025వ తేదీ ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి సమాధానం తెల్పవలెను. లేని ఎడల మీపై కోర్టు వారు పరోక్షమున తీర్మానం చేసి తదుపరి ఉత్తర్వులు జారీ చేయుదురు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షేక్ సంధాని భాషా,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం,
తేది.14-12-25 అడ్వకేట్.